## ఎప్‌సెట్ కౌన్సెలింగ్ నేటి నుంచి

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం మంగళవారం నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని ఆ విభాగం డైరెక్టర్ డాక్టర్ బి. బాలునాయక్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న వారు తేదీల వారీగా కౌన్సెలింగ్‌కు హాజరవుతారు. విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించేందుకు ప్రవేశాల విభాగంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

## జేఎన్‌టీయూలో బీవోఎస్ సన్నద్ధత సమావేశం

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూలో సోమవారం బీవోఎస్(బోర్డ్ ఆఫ్ స్టడీస్) సన్నద్ధత సమావేశం జరిగింది. 2025-26 ఏడాదికి ఇంజినీరింగ్ విద్య సిలబస్‌లో మార్పు తీసుకొచ్చేందుకు కొంతకాలంగా సమాలోచనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే బీవోఎస్ ఛైర్‌పర్సన్స్ కోర్స్ స్ట్రక్చర్, కొత్త సిలబస్ విధి విధానాలపై అంతర్గతంగా కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న తుది బీవోఎస్ సమావేశాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.కామాక్షిప్రసాద్, బీవోఎస్ ఛైర్‌పర్సన్స్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలు, దీనికోసం హాజరయ్యే వారికి ఆతిథ్యం తదితరాలపై సమీక్షించారు. ఐఐటీ, ఎన్ఐటీలతో పాటు పారిశ్రామిక రంగం నుంచి నిపుణులు, జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన కళాశాలల ప్రొఫెసర్లు సమావేశాల్లో పాల్గొని సిలబస్, కోర్స్ స్ట్రక్చర్‌పై తుది నిర్ణయానికి రానున్నారు.

## అన్ని కోర్సులకూ పాత ఫీజులే

**ఉత్తర్వులు విడుదల చేసిన సర్కారు.. ఈ ఏడాది ఫీజుల సవరణ లేనట్లే**




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రొఫెషనల్ కాలేజీల్లోని అన్ని కోర్సుల ట్యూషన్ ఫీజులపై సర్కారు స్పష్టత ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరంలో పాత ఫీజులే ఉంటాయని వెల్లడించింది. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు 2022-25 బ్లాక్ పీరియడ్ ఫీజులే ఈ ఏడాది అమలవుతాయని ఉత్తర్వులు జారీ చేసింది. 2025-28 (మూడేళ్లు) బ్లాక్ పీరియడ్‌లో ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కాలేజీల వారీగా ప్రతిపాదనలు స్వీకరించి, ప్రత్యక్ష విచారణలు జరిపింది. అనంతరం ఫీజులను కూడా ఖరారు చేసింది. అయితే ఫీజులను అధికారికంగా ధ్రువీకరిస్తూ జీవో జారీ చేయాల్సిన తరుణంలో ప్రభుత్వం ఫీజుల సవరణకు బ్రేకులు వేసింది. కొన్ని కాలేజీల్లో ఫీజులు అసాధారణంగా పెరగడంపై సర్కారు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. వ్యత్యాసం భారీగా ఉండటం, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, నిబంధనలు, ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. దీంతో ఫీజుల సవరణను నిలిపివేసింది. ఇక ఫీజులపై త్వరలోనే ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ కమిటీ ఫీజుల ఖరారును పరిశీలిస్తుందని, సవరణను సూచిస్తుందని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఫీజులను ఈ కమిటీ పరిశీలిస్తుందని సర్కారు వెల్లడించింది. వీటితోపాటు హైకోర్టు, సుప్రీంకోర్టుల ఆదేశాల మేరకు ఫీజుల సవరణపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సర్కారు తెలిపింది.

## అప్పిలేట్ ధ్రువీకరణ నేటి నుంచి

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన ఇంజినీరింగ్ కళాశాలల్లో నిజ నిర్ధారణ కమిటీల తనిఖీల్లో గుర్తించిన కొరతలపై వచ్చిన వివరణల ధ్రువీకరణ మంగళవారం నుంచి వర్సిటీలో జరగనుంది. ప్రతి ఏడాది కళాశాలల గుర్తింపు పునరుద్ధరణకు ముందు నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు అన్ని కళాశాలలను సందర్శించి నిబంధనల ప్రకారం నడుపుతున్నారా? లేదా? అన్నది తనిఖీ చేస్తారు. ఈ తనిఖీల్లో గుర్తించిన కొరతలను ఇప్పటికే వర్సిటీ ఉన్నతాధికారులకు ఆయా కమిటీ సభ్యులు నివేదికల రూపంలో అందించారు. వాటిలో 70 కళాశాలల్లో వివిధ రకాల కొరతలు ఉన్నట్లు గుర్తించగా ఆయా కళాశాలల నుంచి ఇప్పటికే అధికారులు వివరణ కోరడం.. వారు లిఖితపూర్వకంగా ఆన్‌లైన్‌లో వర్సిటీకి సమర్పించడం జరిగింది. వారిచ్చిన వివరణలను పరిశీలించేందుకు రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా అప్పిలేట్ కమిటీని నియమించగా ఈ క్రతువు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. కళాశాలల వారు ఇచ్చే సమాధానాలకు అప్పిలేట్ కమిటీ సంతృప్తి చెందితేనే.. గుర్తింపు పునరుద్ధరణకు వర్సిటీకి సిఫార్సు చేస్తారు.

# ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థుల బదిలీకి గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఆర్కిటెక్చర్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఆయా ప్రైవేట్ కాలేజీల మధ్య విద్యార్థుల బదిలీలకు వెసులుబాటు కల్పిస్తూ సాంకేతిక విద్యా కమిషనర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ యూనివర్సిటీల పరిధిలో ఒక కాలేజీ నుంచి మరో కాలేజీకి బదిలీ కోరుకునే విద్యార్థులు జూలై 31లోగా రూ.2,000 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని యూనివర్సిటీ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేశారు.